# Visit of Minister of State for External Affairs Shri V. Muraleedharan to Ghana from 6-7 January 2021

January 07, 2021

## 2021, జనవరి 6-7 తేదీల్లో విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ వి. మురళీధరన్ ఘనా పర్యటన

జనవరి 07, 2021

1. ఘనాకు కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన గౌరవనీయ నానా అడో డాంక్వా అకుఫో-అడో అధ్యక్ష పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి (ఎంఓఎస్) శ్రీ వి. మురళీధరన్ ప్రస్తుతం ఘనాలోని అక్రాలో 2021, జనవరి 6-7 తేదీల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఎంఓఎస్, ఘనా మళయాళీ సంఘం సభ్యులను కలుసుకున్నారు అలాగే, హై కమీషనర్ ఏర్పాటు చేసిన కమ్యూనిటీ స్వాగత కార్యక్రమంలో భారతీయ పౌరులను ఉద్దేశించి ప్రసంగించారు. అదేవిధంగా జనవరి 6న ప్రవాసీ భారతీయ దివస్ వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం సందర్భంగా, ఘనాలో భారతీయ కమ్యూనిటీ ఫోరమ్‌ను కూడా ఆయన ప్రారంభించారు. ఎంఓఎస్ గౌరవార్థం భారతీయ హై కమీషనర్ రాత్రి విందును ఏర్పాటు చేశారు, ఇందులో ఘనా మంత్రులు మరియు ప్రముఖులు హాజరయ్యారు. జనవరి 7న ఎంఓఎస్ ఘనా అధ్యక్షుని పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం అనంతరం, ఘనా అధ్యక్షుడితో భేటీ సందర్భంగా ఆయన వివిధ ద్వైపాక్షిక, ప్రాంతీయ మరియు అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరపనున్నారు. తిరుగు ప్రయాణానికి ముందు ఆయన ఘనాలోని భారతీయ పౌరులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఘనా ప్రతినిధులతో మాట్లాడనున్నారు.

2. ఘనాతో భారత్ అత్యంత సన్నిహిత, సుహృద్భావ మరియు స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉంది. పరస్పర విశ్వాసం, అభివృద్ధి భాగస్వామ్యం, గణనీయమైన స్థాయిలో నివసిస్తున్న ప్రవాస భారతీయుల ఉనికి ఆధారంగా ఈ బంధాలు పటిష్టంగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య క్రమం తప్పకుండా ఉన్నత స్థాయి పర్యటనలు జరుగుతూ వస్తున్నాయి. 2016, జూన్ 12-14 తేదీల్లో ఘనాలో భారత రాష్ట్రపతి పర్యటన, అదేవిధంగా 2018 మార్చిలో అంతర్జాతీయ సౌర కూటమి వ్యవస్థాపక సదస్సులో పాల్గొనేందుకు ఘనా అధ్యక్షుడు అకుఫో-అడో భారత్ పర్యటన, 2019 మార్చిలో 14వ సీఐఐ-ఎగ్జిమ్ బ్యాంక్ కాంక్లేవ్‌లో పాల్గొనేందుకు ఘనా ఉపాధ్యక్షుడు డా. మహముదు బావుమియా భారత్ పర్యటనలు ఇందులో ఉన్నాయి. వ్యవసాయం, నీరు, రవాణా, ట్రాన్స్‌మిషన్ లైన్, మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో సుమారు రూ.450

మిలియన్ డాలర్ల విలువైన రాయితీ రుణాలను ఘనాకు భారత్ అందించింది. దీంతోపాటు, టెమా-పకాడన్ రైల్వే లైన్ నిర్మాణం సహా అనేక మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టల కోసం ఘనా భారత్ నుంచి బయ్యర్స్ క్రెడిట్‌ను కూడా పొందింది. ఘనా అధ్యక్ష భవనం అయిన జూబిలీ హౌస్, ఐసీటీలో భారత్-ఘనా కోఫీ అన్నన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సహా అనేక ఐకానిక్ గ్రాంట్ ప్రాజెక్టులను కూడా భారత్ చేపట్టింది. భారతీయ సాంకేతిక మరియు ఆర్థిక భాగస్వామ్యం (ఐటీఈసీ) ప్రోగ్రామ్ అలాగే ఐసీసీఆర్ విద్యా స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి కీలకమైన ప్రయోజనాలను కూడా ఘనా పొందుతోంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2018-19 ఆర్థిక సంవత్సరంలో 4.5 బిలియన్ డాలర్లుగా, 2019-20 ఆర్థిక సంవత్సరంలో 2.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఘనాలో పెట్టుబడులు పెడుతున్న అతిపెద్ద ఇన్వెస్టర్లలో భారత్ కూడా ఒకటి. 1994 నుంచి 2019 వరకు, భారతీయ కంపెనీలు ఘనా ఆర్థిక వ్యవస్థలోని విభిన్న రంగాలకు చెందిన మొత్తం 730 ప్రాజెక్టుల్లో 1.7 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెచ్చించాయి.

3. అధ్యక్ష పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి పాల్గొనడం, ఘనాతో భారత్‌కు ఉన్న ద్వైపాక్షిక సంబంధాల ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మరింత ఉత్తేజం అందించేందుకు, అలాగే ప్రజల మధ్య పరస్పరం సుహృద్భావ సంబంధాలను పెంపొందింపజేయడానికి ఈ పర్యటన దోహదం చేస్తుందని భావిస్తున్నారు.

**జనవరి 07, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.